01ATP26F_01ATP26F.qxd 26-04-2026 PM 11:26 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 27 ఏప్రిల్ 2026 పేజీలు : 04

# ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెట్రోల్, డీజిల్ కోసం జనం బారులు



అనంతపురంలో ఓ పెట్రోల్ బంక్ వద్ద వాహన దారులతో పాటు బాటిల్స్ పెట్టుకుని క్యూ కట్టిన ప్రజలు



పెట్రోల్ బంక్ వాహనదారులతో కిటకిటలాడుతున్న దృశ్యం

- ❖ పెట్రోల్ బంక్‌ల వద్ద క్యూ కడుతున్న జనాలు
- ❖ పలు సందర్భాల్లో నోస్టాక్ బోర్డులు
- ❖ ఇది కృత్రిమ కొరతనా.. వినియోగదారుల్లో భయాందోళనలే కారణమా..?
- ❖ సరఫరాలో ఏమీ ఇబ్బంది లేదంటున్న అధికారులు

**అనంతపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త బ్యూరో**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల పెట్రోల్, డీజిల్ బంక్‌ల వద్ద జనాలు, వాహన దారులు క్యూ కడుతున్నారు. వినియోగదారుల డిమాండ్ ఎక్కువ కావడంతో కొన్ని సందర్భాల్లో నోస్టాక్ బోర్డులు కూడా పెడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 330 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. గత రెండు మూడు రోజులుగా పెట్రోల్, డీజిల్ బంక్‌ల వద్ద వాహన దారులు క్యూ కడుతున్నారు. ద్విచక్ర వాహన దారులైతే క్యూలో వాహనాలు పెట్టడంతోపాటు బాటిల్స్ సైతం పట్టుకుని మరికొంత మంది క్యూ కడుతున్నారు. కార్లు, జీపులు, లారీలు లాంటి పెద్ద వాహన దారులు కూడా డీజిల్ దొరకక ఇబ్బంది పడుతున్నారు. అమెరికా, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాబోయే రోజుల్లో డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న కారణంతో అవసరం లేకపోయినా ఎక్కువ మంది నిల్వలు ఉంచుకునేందుకు వాహన దారులు కొనుగోలు చేసేందుకు పెట్రోల్ బంక్‌ల వద్ద క్యూ కడుతున్నారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇదే సమయంలో ద్విచక్ర వాహన దారులు కూడా అక్కడక్కడ పెట్రోల్ బంక్‌ల వద్ద నో స్టాక్ బోర్డులు పెట్టడంతో రాబోయే రోజుల్లో పెట్రోల్ దొరుకుతుందో లేదో అన్న కారణంతో ఎక్కువగా బంక్‌ల వద్ద క్యూ కడుతున్నారన్న అభిప్రాయం ఉంది. కొన్ని పెట్రోల్ బంక్‌ల యజమానులు కృత్రిమకొరత సృష్టిస్తున్నారన్న అభిప్రాయం ఉంది. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాలకు గుంతకల్లు కేంద్రంగా ఆయిల్ సరఫరా అవుతుంది. ఈ పరిస్థితుల్లో అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప జిల్లాల్లో కూడా పలు పెట్రోల్ బంక్‌ల వద్ద డీజిల్, పెట్రోల్ కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నంద్యాల, ఆల్లగడ్డ లాంటి ప్రాంతాల నుంచి డీజిల్ కోసం అనంతపురంకు కూడా వస్తున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా వరి కోత మిషన్లకు సంబంధించిన వారు ఎక్కువగా వస్తున్నట్లు తెలియవచ్చింది. డీజిల్, పెట్రోల్, పై స్థాయి నుంచి పెద్దగా కొరత లేదని,



స్టాక్ లేక వెలవెలబోతున్న పెట్రోల్ బంక్

జనవరి-ఫిబ్రవరి-మార్చి నెలల్లో సగటున ఏ మేరకు జిల్లాకు డీజిల్ పెట్రోల్ వచ్చేదో అదే విధంగా సరఫరా అవుతోందని కొందరు పెట్రోల్ బంక్ యజమానులు చెబుతున్నారు. గుంతకల్లు కేంద్రంగా ఉన్న ఆయిల్ సరఫరా కేంద్రం నుంచి ప్రతిరోజు 60 లోడ్‌లు డీజిల్ బంక్‌లకు వెళ్తోందని తెలియవచ్చింది. వినియోగదారుల్లో, వాహన దారుల్లో భయాందోళనవల్లే పెట్రోల్ బంక్‌ల వద్ద ఎక్కువ సమస్యలు ఏర్పడుతోందని, రాబోయే రోజుల్లో దొరుకుతుందో లేదో, రేట్లు పెంచుతారన్న ఆందోళన వల్లే ఈ సమస్య ఉత్పన్నం అవుతోందన్న అభిప్రాయం ఉంది. రాష్ట్రంలో ఐఒసి పెట్రోల్ బంక్‌లు దాదాపు 38 వేలు ఉంటే, బిపిసి పెట్రోల్ బంక్‌లు దాదాపు 22వేలు, మిగతా పెట్రోల్ బంక్‌లు 15వేల బంకులు ఉన్నట్లు తెలియవచ్చింది. రాష్ట్రంలో పలు చోట్ల అక్కడక్కడ ప్రైవేట్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ అక్కడ ధర ఎక్కువన్న కారణంతో అటువైపు వినియోగదారులు వెల్లడం లేదని అభిప్రాయాన్ని ఓ పెట్రోల్ బంక్ యజమాని వెల్లడించారు. ఏది ఏమైనా ఉమ్మడి అనంతపురంజిల్లాలో డీజిల్, పెట్రోల్ బంక్‌ల వద్ద జనం, వాహన దారులు క్యూ కడుతున్నారు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు తీసుకుని రాబోయే రోజుల్లో సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అమ్మవారి రథోత్సవం ప్రారంభిస్తున్న మంత్రి

**- సవిత భక్తిశ్రద్ధలతో వాసవీ మాత జయంతి వేడుకలు - ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సవిత**





వాసవి మాతకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ ఏప్రిల్ 26 ప్రభాతవార్త.**

పెనుకొండ పట్టణంలో వాసవీ మాత జయంతి వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వాసవి మాత జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉదయం నగర సంకీర్తన, మహిళా మండలిచే సుప్రభాత సేవ, అమ్మవారికి పంచామృత అభిషేకం, కలిశపూజ, వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి మాత జయంతి సందర్భంగా పెనుకొండలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ,చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మంత్రి సవిత కి ఘనస్వాగతం పలికి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అమ్మవారి రథోత్సవం సందర్భంగా రథాన్ని మంత్రి సవిత ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వాసవీ మాత ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు యాడికి నాగరాజు, రాధాస్వామి, నాగలూరు నంజప్ప, మోహన్ స్వామి, శబరీష్, సూర్యనారాయణ, శ్రీకాంత్, సురేష్, సుంకు సత్యనారాయణ,నామ రమణ, మొబైల్ సునీల్, శెట్టి శ్రీరాములు, కాశీవిశ్వనాథ్ , భాస్కర్ , ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, మహిళలు,పలువురు కూటమి, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై వృద్ధుడి అసభ్య ప్రవర్తన

**- నిందితునికి దేహశుద్ధి పోలీసులకు అప్పగింత - నిందితుడికి గుండు గీయించిన వైనం - రుద్రంపేటలో ఉద్రిక్తత**

**అనంతపురం క్రైమ్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

ఓ బాలిక పట్ల 60 ఏళ్ల వృద్ధుడు ఖాజా హుస్సేన్ అసభ్య ప్రవర్తించిన తీరు కలకలం రేపింది. ఈ ఘటన అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట కాలనీలో చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ బాలికపై నిందితుడు అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు తన ఇంటిలోకి పిలిపించుకు పోయాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన కాలనీవాసులు వెంటనే నిందితుడి ఇంట్లోకి చొరబడి బయటకు లాక్కొచ్చి దేహ శుద్ధి చేశారు. అంతటితో వదలకుండా గుండు గీయించి అవమానపరిచారు. నిందితున్ని పట్టుకొని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. దీంతో రుద్రంపేట కాలనీలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కానీవాసులు డిమాండ్ చేశారు. కాగా పోలీసులు మాత్రం నిందితుడికి మతిస్థిమితం సరిగా లేదంటూ బయటకు విడిచిపెట్టారని రుద్రంపేట కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాలు, మైనారిటీ మహిళలు ఆందోళన చేసారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దుర్మార్గుడిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన దుర్మార్గుడికి వెంటనే ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేసారు. రేపటిలోగా చర్యలు తీసుకోకపోతే దళిత మైనారిటీ సంఘాలు ఉద్యమిస్తాయని హెచ్చరించారు. కాలనీవాసులు కాజా హుస్సేన్‌కు గుండు కొట్టించి పోలీసులకు అప్పగిస్తే.. నిందితున్ని వదిలేసారని ఆరోపించారు. బాలికలకు అన్యాయం చేస్తే సహించేతే లేదని, పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.



నిందితుడికి గుండు చేయించి పోలీసులకు అప్పగించిన కాలనీవాసులు

### నిందితుడిపై ఫోక్సో కేసు

అనంతపురంలోని చంద్రబాబు కొట్టాలలో మైనర్ బాలిక పై అసభ్యంగా ప్రవర్తించిన ఖాజా హుస్సేన్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాలుగో పట్టణ ఇంచార్జ్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. మైనర్ బాలికను అదేకాలనీలో ఉన్న ఖాజా హుస్సేన్ తన ఇంట్లోకి పిలుచుకొని అసభ్యంగా ప్రవర్తించినాడని అని బాలిక పోలీస్ స్టేషన్‌కి వచ్చి మాకు కేస్ వద్దని, పెద్దమనుషులతో మాట్లాడుకొని వస్తామని చెప్పి వెళ్ళాడన్నారు. కానీ ఆదివారం అతను రాకపోయేసరికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ సహాయంతో సుమోటోగా కేస్ నమోదు చేశామన్నారు. పోక్సో చట్టం కింద ఖాజా హుస్సేన్ అరెస్టు చేశామన్నారు.



- ❖ హనీ వయసు రెండేళ్లు
- ❖ కొరవడిన ఇంటెలిజెన్స్ పర్యవేక్షణ
- ❖ అప్రమత్తం లేకనే హనీ ఉదంతం
- ❖ వికెట్ లిస్ట్‌లో మరో సీఐ..?
- ❖ స్పీడ్ పెంచిన సిట్

# నిదురోతున్న నిఘా..!

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

సంచలనం రేకెత్తించిన హనీ ట్రాప్ ఉదంతంలో నిఘా వర్గాల వైఫల్యం కొట్టొ చ్చినట్లుగా కనపడుతోంది. నగరంలో ఇంత పెద్ద ఎత్తున జరుగు తున్న హనీ మనీ నయా దందాపై ఎందుకు అప్రమత్తం కాలేదన్న భిన్నభిప్రా యాలు జిల్లా ప్రజల్లో వ్యక్తమవు తున్నాయి. హనీ లాంటి విషపు సంస్కృతి ఎక్కడో హైదరాబాద్ చెన్నై బెంగళూరు ప్రాంతాల్లో జరిగేవి. అయితే అభివృద్ధిలో అత్యంత వెనుకబడిన కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు కూడా విస్తరిం చడం వెనుక అదృశ్య శక్తుల హస్తం ఉన్నట్లు అవగతమవుతోంది. ఇలాంటి నీతిమాలిన ట్రాప్ కేసు నగరంలో సుమారు రెండే ళ్లుగా సాగుతు న్నప్పటికీ నిఘా వర్గాలు ఏమి చేస్తున్నాయన్నది అంతు పట్టడంలేదని, ఇది ముమ్మా టికి నిఘా వైఫల్యమైనన్న నిందారోపణలు ప్రజా సంఘాలు, సామాజిక సేవకు ల్లో వ్యక్తం అవుతోంది. హనీ ట్రాప్ నయా దందాపై నిఘా వర్గాలు ఎందుకు అప్రమత్తం కాలేదన్న ప్రశ్నలు జిల్లా వాసులకు ప్రశ్నిస్తున్నాయి. శాంతి భద్రతలపై అనునిత్యం పర్యవేక్షణ, నేరాల అదుపు, అసాంఘిక శక్తుల కదలికలపై ముందస్తుగానే పసిగట్టి, వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వానికి, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు అప్రమత్తం చేయడంలో కీలక పాత్ర పోషించే నిఘా వర్గాలు ఆ దిశగా ఎందుకు ప్రయత్నించలేదన్న అంశాలు లేవనెత్తుతున్నాయి. పోలీసు శాఖలో అనుబంధమైన ఇంటిలిజెన్స్ వర్గాలు హనీ వుదంతంపై పసిగట్టి జిల్లా అధికారులకు నివేదికలు ఇచ్చి ఉంటే ఈ ఉదంతాన్ని ఆనాడే అడ్డుకట్ట వేసేవారనే భావన మేధావి వర్గాల్లో వ్యక్తం అవుతోంది. రెండేళ్లుగా పోలీసుల అధికారులు సిబ్బంది సహకారంతో హనీ కార్యకలాపాలు యదేచ్ఛగా, బాహాటంగా జరుగుతున్నప్పటికీ ఇంటిలెన్స్ వర్గాలు ముందుగానే పసిగట్ట లేకపోయాయంటే ఆశ్చర్యం కలుగుకమానదు. ఇదిలా ఉండగా సిట్ అధికారులు ఈ కేసు క్షేధించేందుకు లోతుగా దర్యాప్తు చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగానే ట్రైన్ ఐపీఎస్ అధికారి అశ్విన్, తాడిపత్రి ఏ ఎస్ పి రోహిత్ కుమార్ లకు బాధ్యతలను అప్పగించారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా చేయాలని కుల,మత వర్గాలకు రాజకీయాలకు అతీతంగా రహస్య దర్యాప్తు కొనసాగించాలని ఇప్పటికే వారితో డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ జగదీష్ లు సమీక్షించారు. దీంతో ఇప్పటికే ఇద్దరు సిఐలపై వేటు పడింది. మరో ఆరుగురు సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవ డం హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఇంటి దొంగలపై ఉన్నతాధికారులు 8 మందిపై కొరడా ఝులిపించారు. ఇకపోతే తాజాగా మరో సీఐపై చర్యలు తీసుకునేందుకు దస్త్రం సిద్ధం చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో ఆ సీఐ ఎవరు..? ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారన్న దానిపై పోలీసు వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలీస్ శాఖలో పనిచేస్తున్న 8 మందిపై ఒకేసారి చర్యలు తీసుకోవడం బహుశా జిల్లాలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. హనీ కార్యకలాపాలకు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ప్రముఖ హోటల్ వేదికగా మారినట్లు తెలుస్తోంది. పోలీసు అధికారులు పొద్దున లేచినప్పటి నుండి కార్డెన్స్ సర్చ్, శాంతి భద్రతల పరిరక్షణ, రౌడీ షీటర్ల నేరస్తుల కదలికలు, ట్రబుల్ మాంగర్స్ కార్యకలాపాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపే పోలీసులు ఇలా హనీ గ్యాంగ్ తో ములాఖత్ అయి వారికి సంపూర్ణ సహకారాలు అందిస్తూ సెటిల్ సెటిల్మెంట్లు, దందాలకు పాల్పడడం పోలీస్ శాఖ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించడంపై పోలీసు ఉన్నత అధికారులు సమగ్ర నివేదికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రెండు, మూడు రోజుల్లోనే హనీ మనీ ముఠా గ్యాంగ్ కు సంబంధించిన ఉదంతంపై చరమగీతం పాడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



అనంతపురం డిఐజి షిమోషి



జిల్లా ఎస్పీ జగదీష్

# విజయ భాస్కర్ మృతిపై వాస్తవాలు నిగ్గు తేల్చండి

**- ఎస్పీ ని కోరిన మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు**

**శ్రీ సత్యసాయి జిల్లా, ఏప్రిల్ 26, ప్రభాతవార్త ప్రతినిధి**

మడకశిర నియోజకవర్గం పరిధిలోని గుడిబండ మండలం మందలపల్లి గ్రామానికి చెందిన విజయ్ భాస్కర్ అనే యువకుడు అనుమానస్పద మృతి పట్ల వాస్తవాలను మిగ్గు తేల్చాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ను కోరారు. ఈ మేరకు ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విజయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకుల తో కలిసి ఎమ్మెల్యే సత్యసాయి జిల్లా ఎస్పీనీ కలిసి విజయ్ భాస్కర్ మృతి పట్ల పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా వారు విజయభాస్కర్ యొక్క మృతి పట్ల తమకున్న అనుమానాలను, సందేహాలను ఎస్పీకి విన్నవించుకున్నారు. విజయ్ భాస్కర్ మరణం హత్య అని నిరూపణ అయితే వారు ఎంతటి వారినైనా సరే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఎం. ఎస్.రాజుకు, జిల్లా ఎస్పీ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్పీని కలిసిన వారిలో సింగల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మాజీ సర్పంచ్ చంద్రప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్. విజయ్ భాస్కర్ కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.



విజయ భాస్కర్ మృతి పట్ల ఎస్పీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మృతుడి కుటుంబ సభ్యులు, నాయకులు

# బిసిలకు మేలు చేసిన ఏకైక పార్టీ వైసిపి

**- గెలిపించే.. ఓడించే శక్తి బిసిలకే ఉంది..**
**- రానున్న ఎన్నికల్లో వైసిపికి అండగా నిలిచి మేలు చేసే పార్టీని గెలిపించుకుందాం**
**- బిసి గళం సభలో వైసిపి ముఖ్య నేతలు**



సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు







సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, బిసి రమేష్‌గౌడ్

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

రాష్ట్రంలో బిసిలకు మేలు చేసిన ఏకైక పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని, ఐదేళ్ల పాలనలో అన్ని విధాలా బిసిలకు సముచిత స్థానం కల్పించిందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బిసిల పట్ల కూటమి ప్రభుత్వం నిరంకుశ వైఖరిని నిరసిస్తూ వైఎస్ఆర్‌సిపి బిసి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని లలిత కళా పరిషత్‌లో బిసి గళం బహిరంగ సభను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎమ్మెల్సీలు భరత్, మంగమ్మ, శివరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గాల సమన్వయ కర్తలు సాకే శైలజానాథ్, తలారి రంగయ్య, కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఈరలక్కప్ప, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి శంకర్‌నారాయణ, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌లతోపాటు పెద్ద ఎత్తున వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా బిసిలకు ఏమి చేసిందని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో బిసిలకు సరైన గౌరవం, సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బిసిలు గెలిపించాలన్నా.. ఓడించాలన్నా..శక్తి మీలోనే ఉందని, రానున్న ఎన్నికల్లో బిసిలంతా వైసిపికి అండగా నిలిచి బిసిలను గుర్తించే పార్టీని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. బిసిల సంక్షేమం కోసం వైసిపి పాలనలో 1.80 లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. అదే విధంగా బిసిలంటే బ్యాక్ బోన్ అని చాటిచెప్పిన ఏకైక నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అంతేకాకుండా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో 24 మంది మంత్రులకుగాను 11 మంది బిసిలను మంత్రులుగా చేసి గుర్తింపునిచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు రెండేళ్ల పాలనలో ఏమీ చేయకపోగా డైవర్ట్ పాలిటిక్స్‌తో కాలం గడుపుతున్నారని ఆయన మండి పడ్డారు. బిసి లంతా ఐక్యతతో కూటమి ప్రభుత్వం పోరాడాలని మేమంతా మీతోపాటు నడుస్తామని పిలుపునిచ్చారు. బిసి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బిసి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ పేరితో బిసిలపై అక్రమ కేసులు పెడుతూ బిసిలకు అణచివేతకు గురి చేస్తోందని మండి పడ్డారు. గత ఎన్నికల్లో బిసిలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ హామీ అమలు చేయకపోగా బిసిల హక్కులను చంద్రబాబునాయుడు కాలరాస్తున్నారని మండి పడ్డారు. రానున్న రోజుల్లో బిసిలంతా ఏకమై మరోమారు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుని బిసిల పాలనను తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్త అయిన నన్ను ఎమ్మెల్సీని చేసిన ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. బిసిలు అంటే జగన్, జగన్ అంటే బిసిలని కొనియాడారు. బిసి ఆడబిడ్డలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తానన్న హామీ ఏమైందని కూటమి ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సాకే శైలజానాథ్, శంకర్‌నారాయణ, మాజీ ఎంపిలు తలారి రంగయ్య, గోరంట్ల మాదవ్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు కూటమి పాలన వైఫల్యాలను ఎండగడుతూ, బీసీలకు వైసిపి చేసిన మేలును గుర్తు చేశారు.



సమావేశానికి హాజరైన బిసి శ్రేణులు

కార్యక్రమంలో పెద్ద ఎత్తున వైసిపి శ్రేణులు, బిసి సంఘాల నాయకులు హాజరు కావడంతో సభ ప్రాంగణం కిక్కిర్సి పోయింది. పలువురు యువకులు భారీ బైకులతో సమావేశానికి హాజరై సంఘీభావం ప్రకటించారు.

## దళిత యువకుడు అనుమానాస్పద మృతి

**- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్ఏ ఎంఎస్ రాజు**

గుడిబండ ఏప్రిల్ 26 ప్రభాతవార్త



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంఎల్ఏ

మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్ అనే దళిత యువకుడు ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న మడకశిర ఎంఎల్ఏ ఎంఎస్ రాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి తో కలిసి మందలపల్లి గ్రామానికి వెళ్లి మృతుడు విజయభాస్కర్ కు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. విజయభాస్కర్ మృతి విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఘటనకు కారణమైన వారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. తదనంతరం కేసు విషయంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీని కలిసేందుకు ఎమ్మెల్యే తన వెంట తీసుకెళ్లారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించి నిజానిజాలు వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, క్లస్టర్ ఇంచార్జీ చిత్రశేఖర్, డాక్టర్ క్రిష్ణమూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, క్రిష్ణప్ప, భోజరాజు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్డదహళ్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న రఘువీరారెడ్డి

గుడిబండ ఏప్రిల్ 26 ప్రభాతవార్త

మండల పరిధిలోని గుడ్డదహళ్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలన బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవం, సమానత్వం లభించాయని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కేవలం విగ్రహాలను ఆవిష్కరించడం కాకుండా, ఆయన సిద్ధాంతాలను జీవితంలో అమలు చేసినప్పుడే నిజమైన గౌరవం చెల్లించినట్టవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, డాక్టర్ రవి శంకర్, రోళ్ల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌడప్ప, స్థానిక దళిత నాయకుడు నాగరాజు, గ్రామంలోని మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి



వాసవి మాతకు విశేష పూజలు దృశ్యం

అమరాపురం ఏప్రిల్ 26 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలోని పురాతన కాలం నాటి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం నందు ఆదివారం వాసవి జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మాత లు అమ్మవారి మూల విగ్రహాన్ని ఊరేగింపుగా దేవాలయ ప్రాంగణానికి తీసుకుని వచ్చి విశేష పూజలు నిర్వహించారు. వాసవి జయంతి వేడుకల సందర్భంగా పాల అర్చకులు విశేష పూజలను నిర్వహించారు అదేవిధంగా అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం మరియు విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక పూలతో అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ట్రాక్టర్ ద్వారా వాసవి మాతను ఊరేగింపుగా ప్రధానవీదులలో తీసుకెళ్లి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువక సంఘం, ఆర్యవైశ్య మహిళలు మరియు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా, ఉపాధ్యక్షుడు భరతరాజు, రాఘవేంద్ర గుప్తా, అశోక్ కుమార్ ,రాము, వాదిరాజు, శ్రీధర్, వినుథ్, ఎలక్ట్రికల్ మంజునాథ్ ,సిద్దేశ్వర, మెడికల్ అజయ్ పాల్గొన్నారు

## కరాటేలో కిరికెర విద్యార్థిని ప్రతిభ



సోహిత సాయిని అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త

హిందూపురం రూరల్ కిరికెర గ్రామానికి చెందిన రమేష్ కుమార్ దంపతుల కుమార్తె సోహిత సాయి కరాటే లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుతుంది. ఆదివారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేడియం నందు జరిగిన కరాటే పోటీలలో పలు ప్రాంతాలకు చెందిన 2180 విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఇందులో సహిత మంచి ప్రతిభ కనబరిచి కార్యక్రమానిర్వహక్కుల నుండి ప్రశంసలు పొంది అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా హిందూపురం ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థిని సోహితను అభినందించారు.

## గ్రంథాలయంలో 28 నుండి వేసవి శిక్షణాతరగతులు..!

ధర్మవరం,ఏప్రిల్ 26,ప్రభాతవార్త

ధర్మవరంశాఖా గ్రంథాలయంలో ఈ నెల 28వ తేది నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుందని గ్రందాలయ అధికారిణి అంజలిసౌబాగ్యవతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తకాలుచదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్ క్విజ్ అంశాలపై శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అమెసూచిం చారు. ఈ తరగతులు ఉదయం 8గంటలనుంచి మద్యాహ్నం 12గంటల వరకు ఉంటాయన్నారు.

## ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా

రొళ్ల ఏప్రిల్ 26 (ప్రభాత వార్త)



ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కును అందికుంటున్న బాధితురాలు

మండల పరిధిలోని ఆవినకుంట తాండ గ్రామానికి చెందిన భీమక్క తన పెద్ద కుమారుడు రవి నాయక్ (34) గత సంవత్సరంక్రితం అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాదాపు మూడు లక్షల వరకు అప్పుచేసి, కర్ణాటక రాష్ట్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించింది. అయినా తన కుమారుడు బ్రతకలేదు. గత ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చిన్న కుమారుడు పాండు నాయక్ (30) కూడా మృతి చెందడంతో తీవ్ర మనస్థాపానికి గురై, ఆర్థిక భారంతో నెట్టుకొస్తుండేది. ఈ విషయాన్ని స్థానిక ఎస్టీ సెల్ అధ్యక్షులు హనుమంత నాయక్, పంచాయతీ యువ నాయకులు యోగానంద్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీటీడీ బోర్డు మెంబర్, టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 1,33,021 రూపాయలు మడకశిర ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం ఆమె అందుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి రుణపడి ఉంటానని ఆమె తెలిపారు. తనకు సహాయం అందించిన స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తహతహలాడుతున్న తమ్ముళ్లు..!

రొళ్ల ఏప్రిల్ 26 (ప్రభాత వార్త)



పాలకవర్గాల గడువు ముగిసిపోయి ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్న విషయం తెలిసిందే. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలో వుండడం, కీలక భూమిక వహిస్తున్నది టీడీపీయే కావడంతో తమ్ముళ్లలో అధిక సంఖ్యాకులు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా? అని వేయి కళ్లతో ఎదురు చూస్తోన్న పరిస్థితి. మరీ ముఖ్యంగా మడకశిర నగరపాలక సంస్థ విషయానికి వచ్చేసరికి సీట్ల కోసం ఫీట్లు చేస్తున్న వారి సంఖ్య గణనీయంగానే వుందని చెప్పవచ్చు. ఈ విషయంలో సీనియర్లుజూనియర్ల మధ్య గట్టిపోటీయే వుందని పరిస్థితులు చెబుతున్నాయి. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో సీనియర్లను పక్కన బెట్టి యువకులకు ప్రాధాన్యమివ్వాలన్నది టీడీపీ యువనేత ఆలోచనగా ప్రచారం సాగుతుంది. ఆమేరకు స్థానిక నాయకత్వం కూడా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం ఆదేశాల మేరకు మొత్తం అంతా కొత్త రకం యువతను ఎక్కించాలని భావిస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులే చెప్పుకుంటున్నరు. అదే జరిగితే సీనియర్ల వైఖరి ఎలా వుంటుందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. అన్నింటికీ మించి మేయర్ గిరీ కోసం ఆశిస్తున్న వారి సం ఖ్యభారీగానే వుంది. దశాబ్దాల నుంచి పార్టీని నమ్ముకున్నవారికి.. ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి మధ్య గట్టి పోటీయే నెలకొందని తెలుస్తోంది. ఎన్నికల ముందు టీడీపీలోకి వచ్చిన వ్యక్తికి మేయర్ అభ్యర్థిగా అవకాశమిచ్చి బొట్టుపెట్టాలంటే స్థానిక నాయకత్వం ఎటువంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో ఎవరి ఊహలకు అందనిది కాదు. ఇది ముమ్మాటికీ టీడీపీ స్థానిక నాయకత్వానికి తలనొప్పి వ్యవహారమే అన్నది నిర్వివాదాంశం. మరోవైపు అన్ని డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక కూడా అంత వీజీ కాదు. అందుబాటులో వున్న 50 డివిజన్లు కాస్త 62 డివిజన్లు కానున్నట్లు తెలిసిందే. కొత్తగా వచ్చే డివిజన్లలో పెద్దగా తలనొప్పులు రాకపోయినా పాత డివిజన్లలో అభ్యర్థుల ఎంపిక టీడీపీ స్థానిక నాయకత్వానికి ఇబ్బందికరం కానుందని చెప్పక తప్పదు. అయితే, ఎన్నికల నోటిఫికేషన్పై ఎటువంటి స్పష్టత లేకపోయినప్పటికీ పార్టీ అధికారంలో వుండడం వల్ల చాలా మంది తమ్ముళ్లు ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

## బాబయ్యస్వామికి బట్ట,పూలచాదర్ సమర్పణ

**భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసిన డాక్టర్ షేక్ రహిమాన్**



బాబయ్యస్వామి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న రహిమాన్, రసూల్

పెనుకొండ ఏప్రిల్ 26 ప్రభాతవార్త



అన్నదానం చేస్తున్న దృశ్యం

పెనుకొండలోని బాబయ్య స్వామి దర్గాలో ఆదివారం బెంగళూరు నగరానికి చెందిన సౌత్ వెస్టర్న్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ షేక్ రహిమాన్ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మొదట బట్ట, పూలచాదర్, ను పకీర్ల నృత్య గానములతో తీసుకువెళ్లి బాబయ్యస్వామి దర్గాలోని సమాధికి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా షేక్ రహిమాన్ కుమారుడు వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ నేషనల్ ఉమెన్ రైట్స్ ఆఫ్ ఇండియా షేక్ రసూల్ తో పాటు కుటుంబ సభ్యులు స్వామివారికి కందూరి సమర్పించి, పేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత10 సంవత్సరముల నుండి ప్రతి సంవత్సరం తమ ఇలవేల్పు అయిన పెనుకొండ బాబయ్య స్వామికి బట్ట, పూలచాదరులు సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేసి, కందూరి నిర్వహించి పేదప్రజలకు అన్నదానం చేయడం పరిపాటి అయిందని తెలిపారు. ఈసందర్భంగా దాదాపు 1200మంది పేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ షేక్ రహిమాన్, కుమారుడు షేక్ రసూల్ కుటుంబ సభ్యులు, షేక్ అలీన, షేక్ అయిమన్ , షేక్ అబ్దుల్ కలాం తోపాటు బంధుమిత్రులు అబ్దుల్ అబ్బాస్, లైబ్రేరియన్ మహబూబ్ బాషా, షేక్ బషీర్ పాల్గొన్నారు.

## ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

ధర్మవరం,ఏప్రిల్ 26,ప్రభాతవార్త



వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రం పటం వద్ద పూజలు నిర్వహిస్తున్న పూజారి ధనుంజయ ఆచారి

శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాదన మహోత్సవాలు కాల బైరవ స్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక చక్రవర్తి థియోటర్ ఎదురుగా ఉన్న కాల భైరవస్వామి ఆలయంలో ప్రతిఏటా బ్రహ్మంగారి ఆరాదన మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ పూజారి ధనుంజయ ఆచారి తెలిపారు. స్వామి చిత్రపటాన్ని పూలతో అం దంగా అలంకరించి పూజలుచేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కృత్రిమ కొరత సృష్టిస్తున్న పెట్రోల్ పంప్ యాజమాన్యం

**- మండిపడుతున్న వాహనదారులు - అధికారుల పర్యవేక్షణ శూన్యం**



పెట్రోల్ బంకు వద్ద పడిగాపులు కాస్తున్న వాహనదారులు

తాడిమర్రి ఏప్రిల్ 26 (ప్రభాతవార్త)

మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వద్ద ఆదివారం పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంపులో పెట్రోల్ డీజిల్ స్టాక్ ఉన్నప్పటికీ టెక్నికల్ సమస్య పేరుతో పెట్రోల్, డీజిల్ పోయకపోవడం తో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పేరుకి రెండు పెట్రోల్ పంపులు ఉండగా ఒక పెట్రోల్ పంపు పూర్తిగా మూతబడడం తో సమస్య తీవ్ర రూపం దాల్చింది. అదే అదనుగా చూసుకొని ఇండియన్ ఆయిల్ పంపు నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. యుద్ధ ప్రభావంతో డీజిల్, పెట్రోల్ లీటర్ 20 నుంచి 25 రూపాయలు ధరలు పెంచాల్సి ఉన్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు వలన వాయిదా వేస్తూ వస్తున్నారని సోషల్ మీడియాలో వదంతులు వస్తున్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వదంతులు గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో హల్చల్ చేస్తుండడంతో పెట్రోల్ పంపు నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టించి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ డీజిల్ పంపులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్లే నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి హెచ్ పి పెట్రోల్ పంపు వాడుకలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనదారులకు పెట్రోల్ డీజిల్ సక్రమంగా అందేలా చూడాలని కోరుచున్నారు.

## పారా మెడికల్ జేఏసీ ఏర్పాటు



నూతనంగా ఏర్పాటైన నర్సింగ్ పారామెడికల్ జేఏసీ నర్సింగ్

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము ఏప్రిల్ 26 ప్రభాతవార్త

జిల్లా మెడికల్ అండ్ హెల్త్ శాఖలో పనిచేస్తున్న నర్సింగ్, పారామెడికల్ ఉద్యోగులు "కాంట్రాక్టు వద్దు – రెగ్యులర్ ముద్దు" అనే నినాదంతో ఉమ్మడి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)ను ఏర్పాటు చేశారు. జిల్లా ఏపీ ఎన్జీవోస్ చైర్మన్ లింగా రామ్మోహన్, జిల్లా కార్యదర్శి యస్ ఈశ్వర్ నాయక్ సూచనల మేరకు ఈ కమిటీ ఏర్పాటైంది. జేఏసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్గా కె. నాగరాజు (ఫార్మసీ ఆఫీసర్), కోచైర్మన్గా యస్ రహమతుల్లా (ల్యాబ్ టెక్నీషియన్), వైస్ చైర్మన్లుగా యస్ భార్గవి, జే సాయి కుమార్, బి బాలాజీ నాయక్, ఎస్.కె. శమత, పి శ్రీనివాస రెడ్డి ఎంపికయ్యారు. జిల్లా కోఆర్డినేటర్గా ఎన్ హరినాథ్, మహిళా కోఆర్డినేటర్గా ఏ అమ్మాజీ, కన్వీనర్గా జి జ్యోతి లింగప్ప నియమితులయ్యారు. అదేవిధంగా కోకన్వీనర్లుగా పి శిరోమణి, మధు చరణ్, ఏ గౌతమి, బి రాము నాయక్, కె లక్ష్మి నరసమ్మ, ఈ రాము నాయక్ ఎంపిక కాగా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె హేమంత్, యం గంగులమ్మ, సెక్రటరీ ట్రెజరర్గా ఏ ఉషారాణి, సబ్ ట్రెజరర్గా బి అమర్నాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ శాఖ ఉద్యోగులు, ఏపీ ఎన్జీవో జేఏసీ సంఘాల నాయకులు, కదిరి తాలూకా అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, పుట్టపర్తి యూనిట్ సెక్రటరీ సూర్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా అధ్యక్షులు జనార్ధన్, టెక్నీషియన్ రాష్ట్ర కోచైర్మన్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా జేఏసీ ఆదేశాల మేరకు భవిష్యత్లో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేస్తామని నేతలు స్పష్టం చేశారు.

## ధర్మవరం తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక



ధర్మవరంతాలూకా ఉద్యోగులసంఘం నూతన కమిటిసభ్యులు

ధర్మవరం,ఏప్రిల్26,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకాశాఖ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికలు ఆర్అండ్బి అతిది గృహ ప్రాంగణంలో నిర్వహించగా వివిద శాఖలకు సంబంధించిన ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అదికారిగా పాలేల రామాంజినేయులు, పరిశీలకులుగా రవి, ముసల్రెడ్డి, పెనుకొండ తాలూకా ప్రసిడెంట్ అబ్దుల్బదీర్లు వ్యవహరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ధర్మవరం తాలూకా అధ్యక్షులుగా సాయిప్రకాశ్, అసోషియేట్ ప్రసిడెంట్గా ఉరుకుందప్ప, ఉపాధ్యక్షులుగా మనహర్ బాబు, రాజశేఖర్, శ్యామల, లతమ్మ, రాజేంద్ర, కార్యదర్శిగా ఓబుళేశు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవీంద్ర, జాయింట్ సెక్రటరీలుగా శైలజ, నాగమణి, శివలక్ష్మమ్మ, శారద, శ్రీదేవి, గీతాంజలి, మల్లేశ్వరమ్మ, అచ్చమ్మ, మల్లేశ్, ఆర్థిక కార్యదర్శిగారాజశేఖరెడ్డి, ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులుగా ఇంద్రజ, సునీతలు ఎన్నికయ్యారు. ఈ విజయం తమకు మరింత బాధ్యతను పెంచిందని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని నూతన అధ్యక్షకార్యదర్శులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## గుమ్మయ్యగారిపల్లి వీరభద్రస్వామి ఆలయంలో హోమాలు

**-ముఖ్యఅతిథిగా మారెమ్మ ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దేవరాజుస్వామి హాజరు**



పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న దేవిస్వామి, గ్రామస్తులు

గోరంట్ల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

గుమ్మయ్యగారిపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కల్యాణోత్సవం, హోమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ దేవరాజుస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు నిర్వాహకులు గుమ్మయ్యగారిపల్లి నీలిమ, అశోక్కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రామ్మోహన్రెడ్డి, వెంకటప్ప, రామచంద్రరెడ్డి, రాజు, నరసింహప్ప, కుమారస్వామి, ఉమారెడ్డి, ఉత్తప్ప, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు విలువలతో కూడిన విద్య బోధన చేయండి

**- ఘనంగా శ్రీ చైతన్య పాఠశాలలో నాల్గవ వార్షికోత్సవం**

**- హాజరైన ప్రముఖులు జెసి, మాజీ మంత్రి పల్లె, ఏజీఎం**




మాట్లాడుతున్న జెసి మోర్య భరద్వాజ్.

కొత్తచెరువు ఏప్రిల్ 26 ప్రభాతవార్త



విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శిస్తున్న దృశ్యం

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ సూచించారు కొత్తచెరువు లోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో శనివారం సాయంత్రం నాలుగో వార్షికోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో కన్నుల పండుగగా జరుపుకున్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి మీరు అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు, పల్లె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చక్కగా చదువుకోవాలన్నారు, మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమక్షంలో క్రమశిక్షణతో మెలగాలన్నారు, అనంతరం ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యార్థుల తరగతి స్థాయిని అనుసరించి అనేక సహ పాఠ్య కార్యక్రమాలు రూపొందించామన్నారు, పాఠశాల గత మూడు సంవత్సరాలుగా సాధించిన ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు, కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ బాలకృష్ణ, విశ్వనాథ్, సమీనా ఖాన్, కోఆర్డినేటర్స్ ఇర్షాద్, అనిత, డీన్ వసంత్ కుమార్, ఏవోలు నాగరాజు, జిలాన్ భాష, ఇన్చార్జులు భార్గవి, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

## తాత్కాలిక బస్సు షెల్టర్లు ఏర్పాటు

**- చలివేంద్రాలు ఏర్పాటు చేయండి**



ధర్మవరం రూట్ నందు తాత్కాలిత షెల్టర్ ఏర్పాటు చేసిన దృశ్యం

కొత్తచెరువు ఏప్రిల్ 26 ప్రభాత వార్త

వేసవికాలం సందర్భంగా ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండటంతో కొత్తచెరువు నాలుగు రోడ్ల కూడలి నందు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు చిన్నపిల్లలు దివ్యాంగులు తదితరులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని పలువురు నేతలు జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లడంతో కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగింది కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్త చెరువులో కదిరి వైపు వెళ్లే ప్రయాణికులు సౌకర్యార్థం బుక్కపట్నం రోడ్డు పక్కనే గ్రీన్ మ్యాట్ తో తాత్కాలిత బస్ సెంటర్ ఏర్పాటు చేశారు అయితే ఆదివారం ధర్మవరం రోడ్డు పివి చౌదరి కాంప్లెక్స్ ముందు తాత్కాలిత బస్ షెల్టర్ ను ఏర్పాటు చేశారు ఈ బస్సు షెల్టర్ ఎంతో ఉపయోగమని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు అయితే పెనుగొండ రహదారిలో కూడా సత్య సాయి బాబా భజన మందిరం ముందు భాగంలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు ప్రతి బస్ షెల్టర్ దగ్గర ప్రజలు సౌకర్యార్థం చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు తాత్కాలిత బస్టాండ్ ఏర్పాటు చేయడంతో ఎంతో ప్రయోజనం అని పలువురు ప్రయాణికులు కలెక్టర్కు సంబంధిత అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబు,రాజు

ధర్మవరం,ఏప్రిల్26,ప్రభాతవార్త

ధర్మవరం మండలం గొట్లూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని మార్కెట్యార్డ్ వద్ద నివసిస్తున్న వికలాంగుడు బాబు, సం య్యగర్కు చెందిన రాజులు మూడు చక్రాల స్కూటర్ లో వెళ్తుండగా అదుపు తప్పి డివైండర్కు డీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాబు పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**జమీయత్ ఉలమా ఆధ్వర్యంలో...**

## షాదీ మహల్లో ఒడుగుల కార్యక్రమం



ఒడుగుల కార్యక్రమంలో నిర్వాహకులు

గోరంట్ల, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

జమియత్ ఉలమా గోరంట్ల శాఖ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన డాక్టర్ల చేత ముస్లిం బాలురకు ప్రతి సంవత్సరం లాగే ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గోరంట్ల షాదీ మహల్లో ఖత్నా క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 75 మంది పిల్లలకు ఉచితంగా ప్లాస్టిబెల్ సర్కమ్ సిసన్ అను అధునాతన పద్ధతి ప్రకారం ఖత్నా చేసి, పిల్లలకు సరిపడ మందులు, కొబ్బరి, బెల్లం, గోధుమపిండి మరియు లుంగీ జమియత్ ఉలమా కమిటీ ద్వారా ఉచితంగా అందచేశారు. పిల్లలకు మరియు వారితో పాటు వచ్చే వారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జమియత్ ఉలమా గోరంట్ల శాఖ అధ్యక్షులు మౌలానా షఫీవుల్లా, ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్లా, జావీద్, డాక్టర్ మసూల్ తాహిర్ అహమద్, ధర్మవరం జాయింట్ సెక్రటరీ ముఖ్తియార్, రియాజ్, ట్రెజరర్ మునాఫ్, సభ్యులు మౌలానా ముజీబ్, మౌలానా అక్బర్, కలీమ్, ఏజాజ్, ఆరీఫ్, హారూన్, వసీమ్, ఖుద్రతుల్లా, హాఫిజ్ ముషరఫ్, సల్మాన్, ఇసహాక్, ఖాలీద్, నిజావ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# టోల్‌గేట్ సిబ్బందిపై దాడి సంఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

## దాడికి దిగిన వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశం

అనంతపురం, ఏప్రిల్ 26, (ప్రభాతవార్త బ్యూరో)

శ్రీ అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం వద్ద ఆదివారం టోల్గేట్ సిబ్బంది పై దాడి వ్యవహారంలో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు స్పందించినట్లు సమాచారం. టోల్గేట్ మేనేజర్ రవి, ఇతర సిబ్బందిపై కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అనుచరులు దాడి వివాదంగా మారింది. టోల్‌గేట్ సిబ్బందిపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరుల దాడిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. టోల్‌గేట్ సిబ్బందిపై దాడికి దిగిన సురేంద్రబాబు అనుచరులపై కేసులు నమోదు చేయాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు.



అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె తిరుపతి రహదారిపై వాల్మీకిపురం సమీపంలో గండబోయినపల్లె వద్ద టోల్‌గేట్ సిబ్బందితో ఆదివారం ఎమ్మెల్యే సురేంద్ర బాబు అనుచరుల వాగ్వాదం, దాడికి పాల్పడ్డారు అని ఆరోపణలు ఉన్నాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది..

# ఘనంగా శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి

## - 333వ ఆరాధన మహోత్సవ వేడుకలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 333వ రాధన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు కె.నాగరాజు ఆచారి, కే.ప్రభాకర్ ఆచారి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చెరువుకట్ట, తాడిపత్రి రోడ్డు వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆరాధన ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. .ప్రతి సంవత్సరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్ర మాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సంవత్సరం 333వ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవ సందర్భంగా స్వామి వారి విగ్రహానికి శాస్త్రోక్తంగా



333వ ఆరాధనోత్సవ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు

విశేష పూజలు నిర్వహిస్తూ అభిషేకాలు చేయడం జరిగిందన్నారు. అనంతరం విచ్చేసిన వందలాదిమంది భక్తులకు స్వామివారి ప్రసాదాలు,అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శరత్, అంజినేయులు, ఎస్‌బిఐ సోము, విజయ్, రాము విజయలక్ష్మి, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఆర్ట్స్ కళాశాలలో ఉద్యోగ మేళా

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థుల ఉపాధి అవకాశాలను కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నెల 28 (మంగళవారం) ఒక ప్రముఖ సంస్థ ద్వారా క్యాంపస్ డ్రైవ్ జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబడునని ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కంపెనీలో సెలెక్ట్ అయినా వారిని హైదరాబాద్‌లో నియామకం చేస్తారు. ఈ క్యాంపస్ డ్రైవ్ 28042026 తేదీన కళాశాల ప్రాంగణంలో జరుగును. ఇందులో తృతీయ సంవత్సరం డిగ్రీ / ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ పూర్తి చేసిన 21-28 మధ్య వయసు గల పురుషులు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికేట్లు, రిజ్యూమ్, ఆధార్ కార్డు వంటి అవసరమైన పత్రాలతో ఉదయం 09:00 గంటల సమయానికి హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగాన్ని సాధించగలరని కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, తాళంకి జీవన్ కుమార్ జేకేసీ కోఆర్డినేటర్ తెలిపారు. పూర్తి వివరాలు, సందేహాల కొరకు 94413 88434 నెంబర్‌ను సంప్రదించగలరు.

# మహోన్నత విలువలను ప్రపంచానికి చాటిన వాసవీమాత

## - ఘనంగా శ్రీ కన్యకాపరమేశ్వరి జయంతి

పామిడి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ధర్మం అహింసా సమానత్వం వంటి మహోన్నత విలువలను ప్రపంచానికి చాటిన వాసవీమాత ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆర్యవైశ్యులు ఆకాంక్షించారు. పట్టణంలోని శ్రీ కన్యకాప రమేశ్వరి దేవాలయం నందు ఆర్యవైశ్య సంఘం, మాతృమండలి, యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్ కు అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో శోభా యమానంగా అలంకరించి 102 కళశాలను మహిళలు కన్యలు తీసుకురాగా మేళతాళాల మధ్య గ్రామోత్సవం జరిపారు. నూతన పంచలోహ ప్రభావ లిని ఆవిష్కరించారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్మీ డియట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తూ సత్కరించారు. 12 మంది కళశాలను గైకొన్న మహిళలను ఎంపిక చేసి వారికి ఒడిబియ్యం అందించి పూజలు మహామంగళ హారతి గావించారు. అహింసా ఆత్మగౌరవం ధర్య పరిరక్ష ణకు ప్రతీకగా నిలిచిన వాసవీమాతను ఆర్య వైశ్యులు ఆరాధ్య దైవంగా కొలుస్తా రని తెలిపారు. అహింసా మార్గంలో ఆత్మా హుతి చేసుకుని ఆత్మగౌరవాన్ని కాపా డిన అమ్మ వారి త్యాగాన్ని స్మరించు కు న్నారు. శ్రీ కన్యకాప రమేశ్వరి మాత దేహ త్యాగం ద్వార సహనం శాంతిని ప్రభోధించి స్త్రీ ఔన్నత్యాన్ని చాటారని కొనియాడారు. వాసవీమాత చూపించిన సత్యమార్గంలో పయనిస్తూ సమాజంలో శాంతి సౌభ్రాతృత్వం పెంపొం దించాలని తెలియజేస్తూ భక్తిశ్రద్ధలతో అమ్మ వారి ఉత్సవాలను చేపడుతూ ధర్మం నీతి సేవా భావం వంటి మహత్తర విలువలను ఆచరిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుద్దామని పిలునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు కే.నారాయణమూర్తి, స్థానిక అద్యక్షులు ఉపేంద్ర, నల్లయ్య, యువజనసంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, మాతృ మం డలి అద్యక్షురాలు నాగవల్లి, మహిళలు పాల్గొన్నారు.



.ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమి స్తున్న వాసవీ మాత



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో గ్రామోత్సవం జరుపుతున్న దృశ్యం.

# పుట్టపాగ మహేంద్ర నాథ్ శతజయంతి ఉత్సవాల్లో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీని సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ఐక్యత సమాజ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని హోటల్ సింధూరిలో నిర్వహించిన మాజీ ఆర్థిక మరియు రెవెన్యూ శాఖ మంత్రి పుట్టపాగ మహేంద్ర నాథ్ శతజయంతి ఉత్సవాల్లో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు, కర్ణాటక మాజీ డీజీపీ పుట్టపాగ రవీంద్ర నాథ్, ఐక్యత సమాజ సంస్థ ఉపాధ్యక్షులు సంకూరి రాజా రావు, తెనాలి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్,గుమ్మా సదాశివరావుతో కలిసి పాల్గొన్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ నా రోల్ మోడల్, నేను ఎంతగానో గౌరవించే మా తాత బండారు నారాయణ స్వామి ప్రాణ స్నేహితుడు. మా మామయ్య కర్ణాటక మాజీ డీజీపీ పుట్టపాగ రవీంద్ర నాథ్ తో వేదిక పంచుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మా తాత పుట్టపాగ మహేంద్ర నాథ్ ప్రజలకు చేసిన సేవలు వెలకట్టలేనివి. వారి జీవితం నేటి యువతరానికి ఎంతో ఆదర్శం. రాజకీయాల్లో సుదీర్ఘకాలం పనిచేసి పేద ప్రజలకు అండగా నిలిచారు.

1957, 1962లో నాగర్‌కర్నూలు ఎమ్మెల్యేగా, 1967, 1972, 1983, 1985లో అచ్చంపేట ఎమ్మెల్యేగా సేవలందించి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఇక పలు మంత్రిత్వ శాఖలను కూడా సమర్థవంతంగా నిర్వహించారు. 1971లో అటవీశాఖ మంత్రిగా, 1972లో అబ్కారిశాఖ మంత్రిగా, 1974లో మార్కెటింగ్ శాఖ, గిడ్డంగులు, 1976లో హరిజన సంక్షేమం, 1983లో రెవిన్యూశాఖ పౌర సరఫరాలు, రిజిస్ట్రేషన్ శాఖలు, ముఖ్యమంత్రి సహాయ నిధి విధులు నిర్వర్తించారు. ఇక 1985లో ఆర్థిక శాఖ, విద్యుత్ శాఖ మంత్రిగా, 1985లో శాసన సభకు ప్రోటం స్పీకర్‌గా వారు చేసిన సేవలు అందించి అరుదైన గౌరవాన్ని పొందారు. ఇంతటి రాజకీయ చరిత్ర ఉన్న తాత మనువరాలిగా నాకు ప్రజా సేవ చేసే అవకాశం లభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. వారు చూపిన మార్గంలోనడుస్తూ, ప్రజలకుమరింతసేవచేస్తానని ఈసందర్భంగాహామీఇస్తున్నానన్నారు.

# టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు వై వి బి రాజేంద్రప్రసాద్ ని కలిసిన దేగల కృష్ణమూర్తి

శింగనమల ఏప్రిల్ 26 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ ని విజయవాడ లోని పెనుమనూరు నియోజకవర్గం ఉయ్యూరు లో అనంతపురం తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షులు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వై వి బి రాజేంద్రప్రసాద్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తెలుగు యువత నాయకులు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



వై వి బి రాజేంద్రప్రసాద్ ని సన్మానిస్తున్న దృశ్యం

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవం

కదిరి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

పట్టణంలోని కోనేరు వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి ఆరాధన కార్యక్రమం ఖాద్రి విశ్వబ్రాహ్మణ సంగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారి పతకావిష్కరణ, గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మండలార్చనలు, స్వామికి సహస్రనామావళి, ద్వాదశాక్షరీ నామహోమం, గణపతి,నవగ్రహ హోమాలు చేపట్టారు. ప్రపంచంలో ఏ వింత జరిగినా ఖిబ్రహ్మం గారు అప్పుడే చెప్పారుఖి అనడం మనం అందరం వింటుంటాం. అలాంటి మహిమాన్వితుడు 333 ఆరాధన కదిరి లో జరుపుకోవడం చాలా ఆనందకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాద్రి విశ్వబ్రాహ్మణ సంఘం ఆలయ కమిటి గౌరవ సలహాదారులు రాజశేఖర్ ఆచారి, ప్రెసిడెంట్ శివాచారి, ప్రధాన కార్యదర్శి ఎస్వి రమణచారి, అధికార ప్రతినిధి హరిప్రసాద్ ఆచారి, కార్య నిర్వాహన కార్యదర్శి పి ఎల్ ఆచారి, కమిటీ మెంబర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురు పూజ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

# మాజీ మంత్రి పెద్దిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికిన డాక్టర్. బత్తల హరిప్రసాద్ ...

కదిరి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

అనంతపురము బీసీ గళం సభ కు విచ్చేస్తున్న..మాజీ మంత్రి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి. ఆదివారం స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, రాయ ఎదుర్గం నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రికి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి దుశ్యాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాజీ మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న బత్తల హరి ప్రసాద్

# బీసీలకు గుర్తింపు ఇచ్చింది తెలుగుదేశం పార్టీనే

## - వడ్డే సిమెంట్ పోలన్న

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

నగరంలోని తెలుగుదేశం పార్టీ అర్బన్ కార్యాలయంలో టిడిపి బీసీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సమాజానికి నిజమైన గౌరవం, ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు రాజకీయ, సామాజికంగా పెద్దపీట వేసిందని, అనేక కీలక పదవులు, అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి కట్టుబడి పనిచేసిందని తెలిపారు. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీలకు అధిక ప్రాతినిధ్యం ఇచ్చిన పార్టీ టిడిపి మాత్రమేనని గుర్తు చేశారు. ఈ సమావేశంలో పద్మశాలి అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మినరసింహులు, నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న, రజక అభివృద్ధి సంక్షేమ సంఘం డైరెక్టర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అండర్-16 బాలుర జట్టు ఎంపిక

## - భారీగా హాజరైన క్రీడా కారులు

అనంతపురం సిటీ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ఆర్డిటి క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపికకు పెద్ద ఎత్తున క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా జట్టు ఎంపిక ఆర్డిటి క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపికకు జిల్లా నుంచి 301 మంది క్రీడాకారులు ఎంపిక కాగా వారికి వివిధ పరీక్షలను నిర్వహించి జట్టు ఎంపికను నిర్వహించారు. త్వరలోనే క్రీడా ప్రదర్శన ఆధారంగా జట్టును ప్రకటిస్తామని ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో పెద్ద ఎత్తున క్రీడాకారులు ఎంపిక పరీక్షకు హాజరు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏడిసిఏ సెలక్షన్ కమిటీ సభ్యులు పెద్దన్న, యువరాజ్, ఇర్ఫాన్, అబ్జర్వర్ మదన్, ఏడిసిఏ ఉపాధ్యక్షులు నూర్ మహ్మద్, జాయింట్ సెక్రెటరీ సర్దార్, సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ క్రీడాకారులు ప్రశాంత్‌కుమార్, కోచ్‌లు శర్మాస్‌వలి, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపికను పర్యవేక్షిస్తున్న ప్రతినిధులు

# వివాహవేడుకకు హాజరైన బొమ్మన శ్రీరామ్ రెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న బొమ్మన శ్రీరామ్ రెడ్డి

శింగనమల ఏప్రిల్ 26 ప్రభాతవార్త జిల్లాకేంద్రం లోని ఎస్.వి.ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం జరిగిన విజయ్ కుమార్ శ్రీలత ల వివాహ వేడుకకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర రైతు విభాగం జనరల్ సెక్రటరీ బొమ్మన శ్రీరామ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్ఆర్సిపి నాయకులు కొప్పెర్ల నాగవర్ధన్ రెడ్డి. శివపురం రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

# వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మూలవిరాట్.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్య వైశ్యులు.

నల్లచెరువు ఏప్రిల్ 26 ప్రభాత వార్త, మండల కేంద్రంలోని వెలిసిన ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానమందు. వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను. ఆర్యవైశ్య కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు జయంతి సందర్భంగా ఉదయం అమ్మవారి మూలవిరాట్ కు పాలాభిషేకం, ఉత్సమూర్తి కి పంచామృత అభిషేకం, కలశ స్థాపన, గణపతి పూజ, హోమం, పూర్ణహుతి, మహామంగళహారతి , నిర్వహించి భక్తులకు దర్శన మిచ్చారు. తీర్థ, ప్రసాదం, వేద పండితుల ఆశీర్వాదం, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం మేళతాల తో భక్తి భజనలు మొదలగు కార్యక్రమాలు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారిని. ఊరేగించారు మండలంలోని ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్

అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 ,30 గంటల వరకు డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా , తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థా యిలో కూడా ప్రతి సోమ వారం ఉదయం 8:30 నుంచి 9:30 వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరుగుతుందని సిఎండి తెలి పారు. జిల్లా స్థాయిలో తమ విదు యుత్ సమస్యలను సూపరి ంటెం డింగ్ ఇంజ నీర్ దృష్టికి తీసు కువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చునని తెలియ జేశారు. తిరుపతి: 8712652679, చిత్తూరు: 79 93147 9 79,నెల్లూరు: 0861 2320427, అన్న మయ్య: 944 0817449 ,కడప: 0856 2242457, కర్నూ లు: 7382614308 ,నంద్యాల: 73826 1897 6, అనం తపురం: 9154790 350 ,శ్రీసత్యసాయి జిల్లా 99 63707847,ఈ సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఏపీఎస్పీడీసీఎల్ ఈఎండి శివశంకర్

# విగ్రహ పునఃప్రతిష్ఠకు కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆహ్వానించిన గ్రామస్తులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం చిన్నపొడమల గ్రామంలో మే 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహిం చనున్న ఆంజనేయస్వామి, లక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఆదివారం గ్రామప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. గ్రామ పెద్దలు కేతిరెడ్డి పెద్దారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య, సాంప్రదాయబద్ధంగా విగ్రహ పునఃప్రతిష్ఠ, కలశ స్థాపన, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



పెద్దారెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం

# వివాహ వేడుకకు హాజరైన కొనుదుల రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

తాడిపత్రి మండలం దిగువపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామపెద్దలు రమేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాలతో సత్కరించారు.



వివాహ వేడుకలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

# పెట్రోల్ బంకులను తనిఖీ చేసిన సిఎస్‌డిటి

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త



పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న సిఎస్‌డిటి మల్లేష్‌ప్రసాద్

తాడిపత్రి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులను ఆదివారం సిఎస్‌డిటి మల్లేష్‌ప్రసాద్ తనిఖీ చేశారు. కొన్ని బంకుల్లో ఇంధన నిల్వలు లేవనే వార్తల నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు తనిఖీలు చేపట్టా రు. కొన్ని బంకుల్లో సాంకేతిక మరియు రవాణా కారణాల వల్ల తాత్కాలికంగా ((నో స్టాక్" బోర్డులు ఉంచినట్లు అధికారులు గుర్తించారు. పెట్రోల్ మరియు డీజిల్ సరఫరాపై ఉన్నతాధికారులతో చర్చించి రాష్ట్రవ్యాప్తంగా ఇంధన నిల్వలకు ఎలాంటి కొరత లేదని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏర్పడిన ఈ తాత్కాలిక ఇబ్బంది ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా తొలగిపోతుందని, అన్ని బంకులకు యధావిధిగా స్టాక్ అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరా నిలిచిపోతుందనే అపోహను ప్రజలు నమ్మవద్దన్నారు. పెట్రోల్ బంకుల వద్ద భారీగా క్యూలు కట్టి ఇబ్బందులు పడవద్దన్నారు. ప్రజలు నిల్వల గురించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# వైభవంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవం

తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, 108 కలశాలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం వాసవి సర్కిల్లో వాసవి మాత విగ్రహం వద్ద దాదాపు 500 మంది ఆర్యవైశ్యులచే వాసవి మాత మంత్రాన్ని 500 మార్లు జపించారు. రాత్రి వాసవి మాత అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు భూమా నాగరాగిణి, ఉపాధ్యక్షులు వంకదారి రాజా, ప్రధాన కార్యదర్శి జయవరం అశ్వత్థరంగయ్య, సంయుక్త కార్యదర్శి భూమా సుబ్రహ్మణ్యం, కోశాధికారి కుప్పం రత్నమయ్య, కమిటీ సభ్యులు రామసుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం

శింగనమల ఏప్రిల్ 26 ప్రభాతవార్త

మండల పరిధిలోని లోలూరు గ్రామంలోని హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 5వ జాతీయ సౌత్ జోన్ సబ్ జూనియర్ బాల బాలికల షూటింగ్ బాల్ పోటీలను అన్నమయ్య జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జి చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఎన్నో ప్రోత్సాహకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మూడు శాతం క్రీడా కోట అమలు చేసి వందలాదిమంది క్రీడాకారులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. అనంతరం ప్రత్యేక అతిధులుగా హాజరైన బి రామసుబ్బారెడ్డి హైదరాబాద్ ఇంగ్లీష్ పాఠశాల జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఈ షూటింగ్ బాల్ జాతీయ పోటీలను తమ స్కూల్లో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షూటింగ్ బాల్ వంటి క్రీడను అభివృద్ధి చేసి రాష్ట్రం మొత్తం వ్యాప్తి చెందేలా కృషి చేస్తున్నటువంటి ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులను, ఇతర జిల్లాల షూటింగ్ బాల్ కార్యదర్శిలకు ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురువ పరుశురాముడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ క్రీడ ప్రాధికార సంస్థ గుర్తింపు పొందిన ఏకైక క్రీడగా షూటింగ్ బాల్ ఉండడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. షూటింగ్ బాల్ క్రీడ అభివృద్ధి తన ఒక్కడితోనే సాధ్యం కాదని ఇది తమ జిల్లా కార్యదర్శిల, జిల్లా షూటింగ్ బాల్ క్రీడా శిక్షకుల మరియు క్రీడాకారుల తల్లిదండ్రుల కృషితో సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఏజీఎం శంకర్ నారాయణ, పాఠశాల సీఈఓ పి ప్రతాప్ రెడ్డి, కర్ణాటక షూటింగ్ బాల్ సంఘ ప్రధాన కార్యదర్శి గంగాధరయ్య, అనంతపురం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గట్టు నాగరాజు, అంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మొట్ట మొదటి అంతర్జాతీయ క్రీడాకారుడు, రాష్ట్ర సంఘం కొసాధికారి విజయ్ కుమార్ గోగులముడి, కర్నూలు జిల్లా కార్యదర్శి నాగరాజు, తిరుపతి జిల్లా కార్యదర్శి నాగరాజు, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి, లత, సునీత, జానకి, సరిత, నాగవేణి, తేజస్విని ఇతర జిల్లా షూటింగ్ బాలు ప్రతినిధులు, క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో గౌరవ వందన స్వీకరిస్తున్న దృశ్యం

# శింగనమలలో ఘనంగా వాసవి శ్రీ కన్యకాపరమేశ్వరిమాత జయంతి ఉత్సవాలు

శింగనమల ఏప్రిల్ 26 ప్రభాతవార్త మండల కేంద్రంలో గల ఆర్యవైశ్యుల సంఘం సభ్యులు ఆదివారం వాసవి శ్రీ కన్యకా పరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వాసవి కళ్యాణ మండపం నందు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత విగ్రహానికి పూలమాలలు వేసి ఆలయ పూజారి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఆనందోత్సవంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అమ్మవారి పూజా కార్యక్రమంలో ఆర్యవైశ్యులు



వాసవి కన్యకా పరమేశ్వరి మాతను ఊరేగిస్తు న్న దృశ్యం

**CHANGE OF NAME**

I, Yaparla Sudhakar Reddy (old name) S/o. Late Yaparla Venkat Reddy, Residing at D.No. 6-777, Varugu Madi Swamy Street, Narapala Village & Mandal, Ananthapuramu Dist. A.P. - 515 425, I have Changed my Name to **YAPARLA SUDHAKARA REDDY** (New Name).

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### - నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక - రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం - జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయ వచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నేడు అనగా సోమవారం అనంత పురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కా ర్యక్ర మం నిర్వహించడం జరుగుతు oదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్ర మాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవ నంలో ఉదయం 9 గంటల నుంచి మ ధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వ హించడం జరుగుతుందని, ఈ కార్యక్ర మంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.



జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

## విద్యార్థులకు క్రమశిక్షణ సంస్కృతి సంప్రదాయలతో పాటు మంచి విద్యాబోధన అందించడమే దీక్షిత స్కూలు ధ్యేయం

### మండలంలో ప్రతి గ్రామానికి స్కూల్ బస్సు ఏర్పాటు. మండల కేంద్రమైన రొద్దంలో శ్రీ దీక్షిత స్కూల్ బ్రాంచ్2 ఏర్పాటు

రొద్దం. ఏప్రిల్ 26 ప్రభాతవార్త.

సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా మంచి క్రమశిక్షణతో మండల కేంద్రమైన రొద్దంలో శ్రీ దీక్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్ ను నర్సరీ నుండి ఏడవ తరగతి వరకు ఏర్పాటు చేస్తున్నామని స్కూల్ కరస్పాండెంట్ కార్తీక్ తెలియజేశాడు ఈ సందర్భంగా ఆదివారం దాదాపు 40 మంది స్కూల్ సిబ్బందితో రొద్దం గ్రామంలో ఇంటింటా స్కూలుకు సంబం ధించిన కరపత్రాలను పంపిణీ చేశారు స్కూల్ వ్యవస్థాపకుడు చైర్మన్ కురుబ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసుకొని వెనుకబడి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి మానసిక ఉల్లాసం కోసం ప్రతిరోజు క్రీడలో నిర్వహిస్తూ వారి సౌకర్యార్థం మంచినీటిని ఏర్పాటు చేసి సందర్భానుసారం పండుగలకు సాంస్కృతిక కళా ప్రదర్శనలు క్రమం తప్పకుండా పాఠశాలలో నిర్వహి స్తామని విద్యార్థులకు మంచి బోధన అందించాలని ఉద్దేశంతో మంచి అను భవం కలిగిన ఉపాధ్యాయులను ఏర్పాటు చేశామని మండలంలో ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని పిల్లల తల్లిదండ్రులు కూడా దీక్షిత స్కూలును సంప్రదిస్తే గదులు స్కూల్ సిబ్బంది ఇక్కడి వాతావరణాన్ని తెలుసుకునే అవకాశం కూడా ఉంటుందని తెలియజేయడం జరిగింది



ఇంటింటా కరపత్రాలను అందజేస్తున్న దీక్షిత స్కూల్ సిబ్బంది

## నిబద్ధతకు గీటురాయి ఉమ్మడిశెట్టి అవార్డు

### - ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారాం

అనంతపురం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త బ్యూరో

38 ఏళ్ళు సుదీర్ఘకాలం నిజాయితీ, నిబద్ధతలు, సాహితీ విలువలు, పునాదులు గా ఏదైనా ఒక సాహితీ సేవాసంస్థ ఉందంటే అది ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు అని ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారాం అన్నారు. ఆయన ఈ సందర్భంగా రాధేయ ఇటీవల వెలువరించిన కొత్త విమర్శ వ్యాసాల సంపుటి అలజడి మా జీవితం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఇవాళ జరిగిన ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ అవార్డు పురస్కార సభలో ఉమ్మడిశెట్టి సత్యాదేవి పురస్కారాన్ని శ్రీకాకుళంకి చెందిన కంచరాన భుజంగరావుకి, ఉమ్మడిశెట్టి సతీ జాతీయ యువ పురస్కారాన్ని సిద్దిపేటకు చెందిన జాబేర్ పాషా, అలాగే ఒంగోలుకు చెందిన పరిమి చరణ్‌కి ఉమ్మడిశెట్టి ఆత్మీయ పురస్కారన్ని ప్రముఖ కవయిత్రి సుమన ప్రణవ్ అందుకున్నారు. గత 38 సంవత్సరాలుగా ఇలా పురస్కారాలు ఇస్తూ తెలుగు సాహిత్యంలో కవులుకు గొప్ప గుర్తింపును అందిస్తున్న ఇలాంటి అవార్డులను అందుకోవడం తమకు ఎంతో సంతోమని అవార్డు గ్రహీతలు స్పందించారు. ఈ అవార్డులను ఉమ్మడిశెట్టి రాధేయ ప్రదానం చేశారు. వారి శ్యీలు డాక్టర్ సుంకర గోపాల్ డాక్టర్ పెళూ ్లరు సునీల్, దోర్నాధుల సిద్దా ర్థ, అంకె శ్రీనివాస్ అవార్డు పొందిన కవుల పుస్తకా లను సమీక్షించారు. ఈ కార్య క్రమంలో కవులు సిరికి స్వామీ నాయుడు, సాంబ మూర్తి, టి.అమరనాథ్ రెడ్డి,టి.వి రెడ్డి. రియాజుద్దీన్, జూటూ రఫీఫ్, జెట్టి జయరాం, ఏపి నాగేంద్ర, పుష్పాల శ్రీరామ్, అనిల్ డ్యాని, మోహిత, చం శాస్త్రి, యమున, మీనాబాయ్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకున్న వారి దృశ్యాలు

## పెట్రోల్,డీజిల్ కొరతంటూ పుకార్లు...!

### - వాహనదారులకు తప్పని పెట్రోల్, డీజిల్ పాట్లు...! - కొరత ఏమాత్రం లేదంటున్న అధికారులు...! పెట్రోల్ బంకులలో మాత్రం తగ్గని క్యూ లైన్లు...!



గుట్టకిందపల్లి పెట్రోల్ బంకులో పెట్రోల్ కోసం క్యూకట్టిన వాహనదారులు



సబ్ జైలు వద్ద క్యూకట్టిన దృశ్యం



.ఆటోలలో క్యాన్లను తెచ్చుకుని డీజిల్ పట్టించుకుంటున్న దృశ్యం

ధర్మవరం,ఏప్రిల్26,ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో ఇరాన్ యుద్ధం మాట దేవుడెరుగు కానీ పెట్రోలు డీజిల్ కోసం యుద్ధాలు సాగుతున్నాయనే చెప్పవచ్చు. పొరుగు దేశాల యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న సోషల్ మీడియాలో ప్రచారంతో ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు క్యూకడుతున్నారు. ఈ ప్రచారం సోషల్ మీడియాలో ఇంధన దిగుమతి లేదు పెట్రోల్,డీజిల్,కొరత గురించి ప్రచారం జరగడంతో వాహనదారులు అవసరము ఉన్నా,లేకున్నా ముందస్తుగా పెట్రోల్, డీజిల్ను తీసుకునేందుకు ఎగపడుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఆదివారం ధర్మవరంలో పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్లతోపాటు ఒక రకమైన యుద్ధ వాతావరణం కనిపించింది. దర్మవరంలో 10 పెట్రోల్ బంకులున్నాయి.పశ్చిమ ఆసియా యుద్ధం కారణంగా గత కొద్ది రోజులుగా గ్యాస్,పెట్రోల్, డీజల్ కొరత ఏర్పడుతుందని ప్రచారం జోరుగా సాగడంతో ఎక్కడ మళ్లీ దొరుకుతుందో లేదో అన్న ఆందోళనతో వాహనదారులు, రైతులు పెట్రోల్ బంకుల వద్ద క్యూకడుతున్నారు. మండుటెండ ను లెక్కచేయకుండా క్యూలైన్లో వేచిఉన్నారు. దీంతో పెట్రోల్ బంకుల ఆవరణాలు వాహనదారులతో కిటకిటలాడాయి.ఈ క్రమంలో గుట్టకింద పల్లిలోని పెట్రోల్ బంకులో మేనేజర్ అందుబాటులో ఉండక పోవడంతో వాహనదారులు ఆం దోళనకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితి అదుపు చేశారు.

## యువతను కబళిస్తున్న మత్తు మహమ్మారి

### - మద్యం, గంజాయికి బానిసవుతున్న విద్యార్థులు, యువకులు - తాడిపత్రిలో పెరుగుతున్న నేరాలు - ఆందోళనలో తల్లిదండ్రులు - కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల డిమాండ్







తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ, స్నేహితుల ఒత్తిడి, సరైన అవగాహన లేకపోవడంతో 16 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న వారు ఈ వ్యసనాల ఊబిలో కూరుకుపోతున్నారు.

**పెరుగుతున్న గంజాయి కేసులు :**

ఇటీవల కూడేరు పోలీసులు తాడిపత్రికి చెందిన గట్టు శివదత్త అనే యువకున్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇతను ఏపీ నుంచి కర్ణాటకకు గంజాయి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తేలింది. ఇలా తాడిపత్రిని కేంద్రంగా చేసుకుని అంతర్రాష్ట్ర గంజాయి దందా సాగుతోందని పోలీసుల దర్యాప్తులో వెలుగుచూస్తోంది. పట్టణంలోని యల్లనూరు రోడ్డు, నంద్యాల రోడ్డు, పట్టణ శివారు ప్రాంతాలు, రైల్వే స్టేషన్ పరిసరాలు, నిర్మానుష్య ప్రాంతాలు గంజాయి సేవించే అడ్డాలుగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**మద్యానికి బానిసలవుతున్న విద్యార్థులు :**

స్కూల్, కాలేజీ విద్యార్థులు సైతం బెల్ట్ షాపుల్లో సులభంగా మద్యం కొనుగోలు చేస్తున్నారని, పుట్టినరోజు పార్టీల పేరుతో మత్తుకు అలవాటు పడుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయితే చాలు మద్యం షాపుల దగ్గర టీనేజ్ పిల్లలు కనిపిస్తున్నారు. ఇంట్లో దొంగతనాలు చేసి మరీ తాగుతున్నారని ఓ తల్లి కన్నీరు పెట్టుకుంది.

**నేరాలకు దారితీస్తున్న వ్యసనం :**

మత్తుకు బానిసైన యువత డబ్బు కోసం చైన్ స్నాచింగ్, దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. కుటుంబ కలహాలు, ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి.

**అధికారులు ఏమంటున్నారు :**

గంజాయి, నాటుసారా, బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టాం స్కూళ్లు, కాలేజీల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని ఎస్ఈబీ అధికారి ఒకరు తెలిపారు.

**ప్రజాసంఘాల డిమాండ్ :** బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేయాలని, గంజాయి ముఠాలపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, ప్రతి స్కూల్‌లో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యువతకు ఉపాధి కల్పిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

వ్యసనాలకు బానిసైతే జీవితం నాశనమవుతుందని యువత గుర్తించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తేనే ఈ మత్తు మహమ్మారిని అరికట్టగలం. మత్తు మాన్పించే కేంద్రాల సమాచారం కోసం 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చు.

## ఉరవకొండ ప్రాంతంలో వాల్టా చట్టానికి తూట్లు..!

### - విచ్చలవిడిగా చెట్లను నరికేస్తున్న వైనం - అభివృద్ధి, ఇతరత్రా పేర్లు చెప్పి చెట్ల నరికివేతలు - నిలువ నీడకోసం వెతుక్కోవాల్సిన దుస్థితులు - కఠిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

ఉరవకొండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ఉరవకొండ ప్రాంతంలో వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయి. ఇటీవలి కాలంలో చెట్లను ఎవరికివారు ఇష్టమొచ్చినట్లు నరికివేస్తూ పర్యావరణానికి ముప్పు తెస్తున్నారు. అభివృద్ధి, ఇతరత్రా అవసరాల పేరుతో ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, ప్రధాన రహదారులు, అటవీ ప్రాంతాలు ఒకటేమిటి ఎక్కడ పడితే అక్కడ అంతా మా ఇష్టం అన్నట్లు చెట్లకు నరివేస్తున్నారు. పదులు, వందల సంవత్సరాల క్రితం నాటి భారీ వృక్షాలు సైతం నేడు అంతరించి పోతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం ఇంటి ఆవరణంలోని చెట్టును కూడా ఎవరూ స్వతహాగా నరికి వేయకూడదు. ఆ చెట్టువల్ల ఏదైనా సమస్య ఉంటే అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించి నిజంగా సమస్య ఉంటే చెట్టును నరికి లేదా స్థలం నుండి తొలగించి మరెక్కడ నాటుతారో తెలుసుకొని ప్రాసెసింగ్ ఫీజు కట్టించుకున్న తరువాత నిబంధనల మేరకు అనుమతులిస్తారు. అనుమతులు తీసుకోకుండా చెట్లను ఎవరు పడితేవారు ఇష్టమొచ్చినట్లు నరికివేస్తే నిబంధనల ఉల్లంఘనలపై భారీగా జరిమానాలు వసూళు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. అయితే ఉరవకొండ ప్రాంతంలో మాత్రం నిబంధనలు మచ్చుకైనా అమలుకు నోచుకోవడంలేదు. కరెంటు, డిష్ వైర్లకు అడ్డు వస్తున్నాయనో లేక ఇళ్లలోకి వెలుతురు రావడం లేదనో, కట్టడాలు, భవనాలు నిర్మించుకోవాలనో ఎలాంటి అనుమతులు పొందకుండానే ఎవరికి వారు పదులు, వందల సంవత్సరాల క్రితం నాటి భారీ చెట్లను నరికేస్తున్నారు. దీంతో స్వచ్ఛమైన గాలి, నీడ కరువై పర్యావరణ సమతుల్యతకు దెబ్బపడుతోంది. ప్రధాన రహదారులకు ఇరుప్రక్కలా ఉన్న చెట్లను రోడ్ల వెడల్పుల పేరుతో నరికేస్తుండగా కొందరు స్వార్థపరులైన వ్యాపారులు రాత్రికి రాత్రే చెట్లను నరికేసి వాటి నుండి వచ్చిన కలపను టింబర్ డిపోలకు విక్రయించుకొని సొమ్ము చేసుకొంటున్నారు. చెట్ల నరికివేతలు అధికమవుతున్న కారణంగా ఎక్కడైనా కాసేపు చెట్ల కిందకు వెళ్లి సేదతీరడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. చెట్ల నరికివేతల కారణంగా సూర్య తాపంతో భూమి వెంటనే వేడెక్కి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండల పరిధిలోని పెన్నహోబిళం అటవీ ప్రాంతంలో ఇటీవలి కాలంలో చెట్ల నరికివేతలు అధికమవుతున్నాయని భక్తులు, పర్యాటకులు వాపోతున్నారు. పెన్నహోబిళం అంటేనే పచ్చదనం అలుముకొని చల్లటి వాతావరణం గుర్తుకొచ్చేదని నేడు అక్కడ ఇష్టారాజ్యంగా భవనాల నిర్మాణాల కోసం అనుమతులు ఇస్తుండటం, అడ్డుకునేవారెవరూ లేక చెట్లను నరికేసి కలపను తరలించుకొని సొమ్ము చేసుకోవడం అధికమైందని వాపోతున్నారు. చెట్ల నరికివేతల కారణంగా సకాలంలో వర్షాలు కురవక ఖరీఫ్, రబీ పంట కాలాల్లో పంటల సాగు సైతం సీజన్లకు అనుగుణంగా జరుగడంలేదు. నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అటవీ తదితర శాఖలు చూసీ చూడనట్లు వ్యవహరి స్తుండటంతోనే చెట్ల నరికివేతలు అధికంగా కొనసాగుతున్నాయని ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ పరిరక్షకులు వాపోతున్నారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతున్నారు.



ఉరవకొండలోని ఎంఆర్‌సీ వద్ద ఇటీవల భారీ చెట్లను నరికేస్తున్న దృశ్యం



నరికేసిన చెట్ల కొమ్మలను రాసులుగా వేసిన దృశ్యం

## పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరుతున్న వాహనాలు..!

### - పలు బంకుల్లో డీజిల్ కొరత, పెట్రోల్ స్టాక్ అంతంతమాత్రమే? - వివిధ పెట్రోల్ బంకులవద్ద ఏర్పాటైన నో స్టాక్ బోర్డులు - నేటి నుండి పరిస్థితి మరింత ఆందోళకరమయ్యే అవకాశం

ఉరవకొండ, ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ఉరవకొండ ప్రాంతంలోని పెట్రోల్ బంకులవద్ద ఆదివారం వాహనదారులు బారులుతీరి కనిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల డీజిల్, పెట్రోల్ లభించడంలేదని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగడంతో వాహనదా రులు పెట్రోల్, డీజిల్ కోసం ఎగబడటం కనిపించింది. ఉరవకొండ ప్రాంతంలోని ఏ పెట్రోల్ బంకువద్ద చూసినా వందల కొద్ది వాహనాలు కనిపించాయి. పలు బంకుల్లో డీజిల్ లభించకపోగా పెట్రోల్ అందుబాటులో ఉన్నా స్టాక్ తక్కువగా ఉండటంతో మా వాహనాలకు ముందంటే మా వాహనాలకు ముందు ట్యాంకు ఫుల్ చేయడంటూ వాహనదారులు ఎగబడటం కనిపించింది. పలువురు ఈ కొరత ఇంకెన్నాళ్లు కొనసాగుతుందోనని క్యాన్లను తీసుకొచ్చి మరీ పదుల లీటర్ల కొద్ది పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లారు. అందరికీ ఇప్పుడున్న స్టాక్ సరిపోంతుంది ఇండెంట్ కూడా పెట్టామని రేపు, ఎల్లుండి ట్యాంకర్లు వస్తాయని ఎవరూ ఆందోళన పడాల్సి పనిలేదని పెట్రోల్ బంకుల యజమానులు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నా వినియోగదారులు మాత్రం నెమ్మదించడం లేదు. కాగా పట్టణంతోపాటు జాతీయ రహదారికి పక్కనగల పలు పెట్రోల్ బంకులవద్ద సాయంత్రానికి నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వగా వాహనాలేవీ బంకుల ప్రాంగణంలోకి రాకుండా తాడులను సైతం అడ్డుగా కట్టి ఉంచడం కనిపించింది. అమెరికా–ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ఈ కొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం పెట్రోల్, డీజిల్ కొరతపై సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దని బంకుల్లో తగినంత స్టాక్ ఉందని చెబుతున్నారు.



: ఉరవకొండలోని ఒక పెట్రోల్ బంకువద్ద వాహనాల రద్దీ



ఒక నో స్టాక్ బోర్డు పెట్టి వాహనాలు రాకుండా తాడు అడ్డుగా కట్టిన దృశ్యం

## అనంతలో ఇంధన యుద్ధం - బంకుల వద్ద బారులు

### సరఫరా ఆగిందని జోరుగా ప్రచారం - వ్యాపారస్తుల కృత్రిమ కొరత

అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 26 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంధన యుద్ధం ప్రారంభమైంది. పశ్చిమ దేశాల్లో గత కొంతకాలంగా జరుగు తున్న యుద్ధం ఎఫెక్ట్ కారణంగా అకస్మా త్తుగా పెట్రోల్ బంకుల కు సరఫరా నిలిపిస్తారని ప్రచారం జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగింది. దీంతో వాహనదారులు పెట్రోల్ డీజిల్ నింపు కునేందుకు ఎగబడ్డారు. దీంతో పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాలు జనంతో కిక్కిరిసి పోయాయి. ఉదయం నుండే బంకుల వద్ద క్యూ కట్టారు. తమకు ఇంధనం దొరుకుతుందో లేదోనన్న ఉత్కంఠతో వాహనదారులు పోటీ పడడంతో ఉద్రిక్తతకు దారితీసింది. గంటలకొద్దీ క్యూలో నించొని తమ వాహనాలకు వెంట తెచ్చుకున్న క్యాన్లలో పెట్రోల్ డీజిల్ నింపుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

అధికారులు స్పందించి పెట్రోల్, డీజిల్ సంఘరా క్రమబద్ధీకరించాలని వినియోగదారులు కోరారు. మరోవైపు కొందరు వ్యాపారస్తులు కృత్రిమ కొరతను సృష్టించి నో స్టాక్ బోర్డులు పెట్టేయడంతో పరిస్థితి మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇది లా ఉండగా సివిల్ సప్లై ఉన్నతాధికారులు మాత్రం ప్రజలు పుకార్లను నమ్మ వద్దని కోరారు. ఇందన కొరత లేదని కొట్టిపారేశారు. ప్రజలంతా సమన్వయం పాటించాలని కోరారు.



పెట్రోల్ పంపు వద్ద బారులు తీరిన వాహనదారులు



బైకుల్లో నిప్పుతున్న పెట్రోల్

## గొర్రెల సుంకం..దళారులకు భోజ్యం..!

### ః క్రయవిక్రయాలతో సంబంధం లేకుండా వసూళ్లు ః గ్రామసమీప మార్కెట్ యార్డును కాదని దూరంగా నిర్వహణ ః అధికారుల ఉదాసీనత..ఫిర్యాదులపై నిర్లిప్తత



గతంలో మార్కెట్‌యార్డులో సాగిన గొర్రెల సంత



ప్రస్తుతం దళారుల నీడలో సాగుతున్న గొర్రెల సంత



ఆదాయపు గండిని అరికట్టమన్నా అలసత్వం వీడని అధికారులు

యాడికి(తాడిపత్రి), ఏప్రెల్ 26, ప్రభాతవార్తః

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారపు సంతలో ప్రతి వారం రూ.3.5 లక్షల ఆదాయం వస్తే అందులో గొర్రెలు, మేకల విక్రయాల నుంచే రూ. 2 లక్షలకు పైగా వస్తోందంటే ప్రభుత్వానికి ఎంత ఆదాయం సమకూరుతోందో గ్రహించవచ్చు. ఇక్కడ గొర్రెలు,మేకల సంత పూర్తిగా మార్కెటింగ్ శాఖ పరిధిలోనే నిర్వహిస్తున్నారు. అయితే యాడికిలో గొర్రెల సంత మాత్రం మార్కెట్ యార్డు ఆవరణాన్ని, ఆ శాఖను కాదని కొందరు దళారుల కనుసన్నల్లో నిర్వహిస్తుండటం విడ్డూరం. ప్రభుత్వానికి గాని, పంచాయతీలకు గానీ స్థానికంగా ఆదాయ వనరులుంటే వాటిని మరింత అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నం చేయడం ఎక్కడైనా సహజంగా చూస్తుంటాం. కానీ ఇక్కడ అందుకు పూర్తి విరుద్ధంగా సంత నిర్వహణ సాగుతున్నా పట్టించుకునే పాలకులు గాని, అధికారులు గాని కనుచూపు మేరలో కనిపించడం లేదు. ప్రజా ప్రయోజనం కంటే పార్టీ గెలుపు కోసం పనిచేసిన మా ప్రయోజనమే ముఖ్యమంటూ కొందరు అనుచరులు చేస్తున్న నిర్వాకం ఆ పార్టీకి ఎనలేని చెడ్డపేరు తెస్తోందని ఆ పార్టీ అభిమానులు, గొర్రెల వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

**ఃవారు చెప్పిందే వేదం..చేసిందే న్యాయం..!**

గతంలో మార్కెట్ యార్డులో నిర్వహించే గొర్రెల సంతలో చిరు వ్యాపారులు తమ గొర్రెలను, మేకలను సంతలో విక్రయిస్తేనే ప్రభుత్వానికి సుంకం చెల్లించేవారు. కానీ ప్రస్తుతం గొర్రెలు సంతలోకి వచ్చి బయటికి వెళితే చాలు క్రయ విక్రయాలతో సంబంధం లేకుండా ప్రతి జీవానికి రూ.20 లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గ్రామ సమీపంలోని విశాలమైన మార్కెట్ యార్డును కాదని ఎక్కడో కిలో మీటర్ల దూరంలో కనీసం నీటి వసతి లేని చోట గొర్రెల సంత నిర్వహిస్తే ఎలా అని పలువురు వ్యాపారస్తులు వాపోతున్నారు. రెండు మూడు గొర్రెలున్నా అక్కడికి వెళ్లి విక్రయించుకోవాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇది తమకు అదనపు భారం అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది భరించలేక ఇగుడూరు, కోనాపురం, పుష్పాల తదితర గ్రామాలకు చెందిన వ్యాపారస్తులు సంతలోని నిర్వహకులతో ఘర్షణలకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. మీ ఇష్టముంటే రండి లేకుంటే లేదు..మేము మిమ్మల్ని రమ్మని బతిమాలామా..మీరు రాకుంటే మాకు జరగదా..మేము ఇలాగే వసూలు చేస్తాం..మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోపోండి..వంటి వ్యాఖ్యలతో తమపై ధిక్కార ధోరణి ప్రదర్శిస్తున్నారని దళారుల అనుచరులపై కొందరు వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దళారులు చెప్పిందే వేదం..వసూలు చేసిందే సుంకం అన్నట్లు పరిస్థితి తయారైందని వారు వాపోతున్నారు.

**ఃఅధికారుల చోద్యం..దళారులకు బోజ్యం..ః**

ఈ గొర్రెల సంత నిర్వహణ మార్కెట్ యార్డు పరిధిలోనిది అయినప్పటికీ ఆ శాఖ అధికారులు, ఈ సమస్యపై ఎమ్మార్పీఎస్ నాయకులు మండల స్థాయి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలకు వెనుకాడుతున్నారు. వారానికి దాదాపు రూ.40 వేల నుంచి 50 వేల వరకు పంచాయతీకి గాని, మార్కెటింగ్ శాఖకు గాని రావాల్సిన ఆదాయం పరాయి పరం అవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అంటే ఏడాదికి దాదాపు రూ. 20 లక్షల ఆదాయం పక్కదారి పడుతోందన్న మాట. ఎండలు మండి పోతున్న ప్రస్తుత తరుణంలో జీవాలకు నీరు తాపుకోవడానికి కూడా ప్రస్తుత వ్యాపార ప్రదేశంలో సౌకర్యం లేదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల అదీనంలో జరగాల్సిన వ్యాపారం ఎవరో ఇద్దరి చేతుల్లో తాము చెప్పిన చోట జరుగుతోందంటే అధికారులు, చట్టం నిర్వీర్యమైనట్లేనా అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. పెద్దల పేరు చెప్పి గద్దల్లా తన్నుకుపోతున్న ఈ దందాకు అడ్డుకట్ట పడాలని, పంచాయతీ, ప్రభుత్వ ఆదాయం మెరుగవ్వాలని స్థానికులు కోరుతున్నారు.